
'హిమబిందు'

# ఇదో కల



**ఆలోచనల నుండి** తెప్పరిల్లింది. పైట లాగుతున్న కొడుకు వరుణ్. ఆప్యాయంగా దగ్గరకు లాక్కుని అపురూపంగా పొదివి పట్టుకుంటూ ఒడిలో కూర్చోబెట్టుకుంది. మళ్ళీ ఆలోచనలు... ఆలోచనల మధ్య గతం ...

"రూపా ... మీ వాళ్ళు గుర్తొస్తున్నారా?"

రూపాదేవికి కళ్ళ నిండా నీళ్ళూరాయి. ప్రతి క్షణం తనను కవిపెట్టే ఈశ్వర్ తనకు ఉండగా తనవాళ్ళ గురించి ఎందుకు ఆలోచించటం?

ఈశ్వర్‌ను మనఃస్ఫూర్తిగా ప్రేమించింది. అతనూ ప్రేమించాడు. పెళ్ళి చేసుకుని ఇంటికి వెళితే పిచ్చి పిచ్చిగా తిట్టి వెళ్ళిపొమ్మన్నారు. బయటికి వచ్చి గుట్టుగా కాపురం చేసుకోసాగారు.

ఉద్యోగం లేని ఈశ్వర్ రూపాదేవి ఉద్యోగం చేసి సంపాదిస్తున్న సంపాదన మీదనే గడుపుతున్నాడు. రెండు నెలలు గడిచాయి. ఈశ్వర్ వైపు వారు ఒక్కొక్కరూ రాసాగారు. ఉదయం వెళ్ళి సాయంత్రం తను రావటం. ఈ లోగా ఏమవుతుందో ఏమోగానీ ఈశ్వర్ చిరాకుపడేవాడు. ఓపిగ్గా సర్దుకుపోయేది. నెలలు గడుస్తున్నాయి. ఈశ్వర్‌లో విచిత్రమైన మార్పు వచ్చింది. తనపై చేయి చేసుకోవాలనుకోవటంతో ఎంతో అసహ్యం వేసింది.

ఒక రోజు తన మనసులో మాట బయట పెట్టాడు, విడాకులు తీసుకుందామని ... అతనిపై ఏ మూలో కాస్త ఉన్న అభిమానం కూడా ఎగిరి పోయింది. రెండు, మూడు రోజులు ఆలోచించింది.

విడాకులు వద్దు. మీ పాదాల దగ్గరే పడి ఉంటాననటం ఇష్టంలేదు. తనకు ఉద్యోగం ఉంది. తనకు పుట్టే బిడ్డను అపురూపంగా పెంచుకో గలదు. ఇక్కడ ఉండి దెబ్బలు తింటూ సహించలేదు.

విడాకులు తీసుకుంది. ఇంత కామ్‌గా ఒప్పుకుంటుం దనుకోలేదు ఈశ్వర్. తన ఇంటి నుండి, తన మనసు నుండి వెళ్ళిపోయాడు ఈశ్వర్. బాధ... ప్చ్... బాధపడకూడదు. తనకు కావాల్సింది ధైర్యం— అంతే.

అతను తనవాళ్ళ దగ్గరకు చేరటం, గొప్ప కట్నంతో పెళ్ళికావటం జరిగిపోయాయి. తను ఎలాంటి గొడవ పెట్టుకోలేదు. విడాకులై పోయాయి. ఇంకేముంది తనకూ, అతనికీ సంబంధం? ట్రాన్స్‌ఫర్‌పై ఈ వూరు వచ్చింది. బాబుకు రెండు సంవత్సరాలు నిండాయి... రోజులు నెలలై, నెలలు సంవత్సరాలవుతున్నవి. బాబుకు ఆరేళ్ళు వచ్చాయి.

తనలో ఏదో సంఘర్షణ—ఎవరితోనూ చెప్పుకోలేనిది. తను తీర్చుకోలేనిది. జంటలు ... జంటలు ... పక్షులు... మనుషులు... ఎన్నెన్నో... తను ... తను... ఒంటరి అంకె. కాదు. తనకు బాబు ఉన్నాడు. తను అందగత్తె కాకపోయినా ఫర్వాలేదు. తన వయసు ఏమంతని? తను... తను ... పెళ్ళి చేసుకుంటే ... తన ప్రక్కన హుందాగా ఒక పురుషుడు ... తమ ఇద్దరి మధ్య గర్వంగా నడుస్తూ బాబు...

కోరిక... అతని ఒడిలో పడుకోవాలని... అతన్ని అల్లుకుపోవాలని... అతనిలో ఐక్యం కావాలని... ఎన్నాళ్ళీ మానసిక వేదన? తనపేరున బాంక్ బాలెన్స్ ఉంది. తనకు జాబ్ ఉంది. నల్గురిలో దర్జాగా కన్పిస్తోంది.

కానీ లోటు ... లోటెంతో ఉంది. తనకు తనవాడు గావాలి. తనవాడు గావాలి. ఉలిక్కిపడింది.

బాబు ఒడిలో నిద్రపోతూంటే లేచింది రూపాదేవి.

• • • •

ప్రతి క్షణం రూపాదేవికి ఇదే ఆలోచన అయి పోయింది. ఎవరితోనూ క్లోజ్‌గా ఉండదు. ఎంతో స్ట్రిక్ట్ అనే పేరున్న రూప నలుగురితో కాస్త ఫ్రీగా ఉండ సాగింది. ఎంతో మందికి ఆనందమయింది రూపాదేవిలో ఈ మార్పు.

రాత్రి పూట ఏవేవో భావాలు ... కలలు ... ఎవరో తన దగ్గరగా పడుకున్నట్లు... తనతో ఏదో గుసగుసలాడినట్లు... తను సిగ్గుపడుతున్నట్లు ... కళ్ళు తెరిచి చూడటం... అంతా శూన్యం. ఫలితం— కళ్ళనిండా నీళ్ళు. గుండెనిండా బరువు.

తన ప్రవర్తనలో చిన్న లోపం కూడా కన్పించదు. ఎంతోమంది మారీడ్... వారికి లోకువ గాలేదు. వారి భార్యల మనస్సుల్లో రాక్షసిలా నిలువ లేదు. అందరూ ఎంతో ఆప్యాయంగా పలుకరిస్తారు— ఏ చిన్న కష్టం వచ్చినా ఆదుకుంటారు.

ఆ రోజు ఆఫీసునుండి వస్తూంది రూపాదేవి.

"ఏమండీ!" వెనగ్గా మృదువైన పిలుపు. వెనక్కు తిరిగింది. వైట్ డ్రెస్‌లో 'టక్' చేసుకుని కనిపించాడు అతను.

"మీ పేరు ..."

"రూపాదేవి."

"మీతో కాస్త మాట్లాడాలి... మీ ఇంటికి..."

"రండి" అంది గంభీరంగా. ఇంటికి వచ్చిందాకా ఏం మాట్లాడలేదు. తాళం తీసి అతన్ని కూర్చోమని ఫాన్ స్విచ్ వేసింది.

"అమ్మా" ఇంత పొడుగు సంచీ తగిలించుకుని లోపలికి పరుగున వచ్చిన బాబు ఠక్కున ఆగి పోయాడు కొత్త వ్యక్తిని చూసి.

"కమాన్, వరుణ్."

కిచెన్‌లోకి పోబోతున్న రూపాదేవి కరెంట్ షాక్ కొట్టిన దానిలా వెనక్కు తిరిగింది.

"నేను విజయవాడనుండి ఈ మధ్యే ట్రాన్స్‌ఫర్ మీద వచ్చాను. మీ అన్నయ్య కృష్ణ నా బెస్ట్ ఫ్రెండ్ ..." కనుబొమల మధ్య ముడత తేటగా అయింది.

"అన్నయ్య ... అన్నయ్య ... కృష్ణ అన్నయ్య" అంటున్న రూపాదేవి కళ్ళ నిండా నీళ్ళు నిలిచి బుగ్గలపై కారేయి.


"ప్లీజ్ ... రిలాక్స్ అవండి. నేను వచ్చి మిమ్మల్ని బాధపెట్టినట్లున్నాను"

"ఛ ఛ అదేంలేదు. ఎన్ని రోజుల తర్వాత ... సంతోషమండీ. ఇదంతా సంతోషమే" అంటూ బాబుకు బిస్కెట్స్ పెట్టి, అతనికి టీ, బిస్కెట్స్ అందించి, తనూ అతని ఎదురుగా కూర్చుంది.

"ఏయ్ టింకూ ..." బయటి నుండి సన్నటి పిలుపు.

"అదిగో భాను. అమ్మా, వెస్తున్నా" అని ఆటకు పరిగెత్తాడు వరుణ్.

"ఆఁ ఇక చెప్పండి" అంటూ అతనివైపు చూసి తడబడింది. అప్పటివరకూ ఆమెనే చూస్తున్న అతను "నా పేరు వీరేంద్రబాబు. నేను బిజినెస్ చేస్తుంటాను. కృష్ణ మీగురించి చెబుతుంటాడు."




"అంటే!"

"ఆఁ అంతా ..."

"ఈ మధ్య పెళ్ళి చేసుకున్నాడు కూడా. ఆవిడ చాలా మంచిది."

"నిజంగా!"

"ఆమె ఎవరో కాదు. నా కజిన్."

"రియల్లీ..." సంతోషంతో తేలిపోయింది రూపాదేవి మనసు. ఎన్నాళ్ళ తర్వాత పుట్టింటి కబుర్లు. అతను గంట పైగా ఉండి వెళ్ళిపోయాడు. ఆ రోజంతా ఎంతో ఆనందంగా గడిపింది.

అతను మధ్య మధ్య రాసాగాడు. అతను వస్తున్నాడంటే మనసులో ఏదో అలజడి. గంట ... రెండు గంటలు ... మూడు గంటలు...ఇలా సమయం తెలవదు. ఎవరేమన్నా అనుకుంటారేమో అని ఎవరితోనైనా ముభావంగా ముక్తసరిగా మాట్లాడే రూపాదేవి ఇప్పుడు ఎవరో అనుకుంటే నాకేమిటి అని ధైర్యంగా అనుకుంటుంది. అయినా అనుకోనీ ... అతనికి భార్యాపిల్లలూ ఉన్నారు. ఆమె కోరిక మీద ఒకటి రెండు సార్లు భార్యను తీసుకువచ్చాడు. కాకిముక్కుకు దొండ పండులా ఉంది జంట అని అనుకుంది. గంటపైగా అబ్జర్వ్ చేసింది. ఏ కోణంలో కూడా అతనికి తగినట్లుగా అన్పించలేదు.

పరిచయం పటిష్ఠంగా అయింది. ఒకరి విషయాలు ఒకరికి పూర్తిగా తెలిసిపోయాయి. అతని మనసెంతో విశాలం. మంచి మంచి భావాలు. ఆవిడ వలన ఎంతో అసంతృప్తి ఆట... నిజమే... ఇతనికి తనలాంటి భార్య ఉంటే ... ఒళ్ళు జలదరించింది. తనకు...తనకు...అంత అదృష్టమా? ఈ సంవత్సరంలో అన్ని విధాలుగా అతన్ని ఆమె పరిశీలించింది.

తన మనసునిండా అతను నిలిచిపోయాడు. అతని మనసు నిండా తను నిలిచిపోయినట్లు అతను చెప్పకనే తెలుసు ఆమెకు. అయినా అడిగేస్తే ... అవకాశాలు ఎంతో తక్కువ తనలాంటి వాళ్ళకి. ఏమనుకుంటాడో అతను. ప్చ్ ... వద్దు. ఆమెన్న బాధపెట్టినట్లు కాదా? బాధ ఏముంది? తనజీవితం తన కుంది. కావాలంటే అతనికి హెల్ప్ చేస్తుంది. అతను తన బాబుకు తండ్రి అయితే చాలు. మధ్య మధ్య తన దగ్గరికి వచ్చి పోతుంటే చాలు. కానీ... కానీ

తలుపు చప్పుడు. వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా అతను. చేతిలో పూల పొట్లాం.

లోపలికి వచ్చి పేపర్ తొలగించి పూలు అందించాడు. వణుకుతున్న చేతులతో అందుకుంది. కుర్చీలో కూర్చున్నాడతను. ముభావంగా నిల్చున్న ఆమెను కళ్ళెత్తి చూశాడు.

"ఏమిటి రూపా ... అలా ఉన్నావ్?"

"ఏం లేదు" అంటున్న ఆమె కళ్ళ నుండి నీళ్ళు జారి వళ్ళో పడ్డాయి.

"అరె... రూపా ...ఏమిటిది? ఆఁ" అంటూ లేచి ఆమె దగ్గరకు వచ్చాడు. అంతే ... ఆమె అతనిపై వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది.

"అరె ... ఏమిటిది రూపా ప్లీజ్ చెప్పు" అంటూ ఆమెను బుజ్జగిస్తూ అడుగుతుంటే రూప ఏడుపు ఇంకా ఎక్కువైంది.

"మీరు మీరు నన్ను పెళ్ళిచేసుకోండి."

"రూపా ..." అతని చేతులు ఆమెను చుట్టి దగ్గరకు లాక్కున్నాయి.

"నాకూ అదే ఆలోచన ఉంది, రూపా...కానీ..."

"మీ భార్య గురించా ..."

తల వూపాడు అవునన్నట్లుగా.

"నేను ఆమెకు ఏ రకంగానూ అడ్డురాను. నాకు జీతం ఉంది. దానితో బ్రతుకుతాను. మీరు నాకోసం

పైసా ఖర్చు పెట్టక్కర్లేదు. నా కో మగదిక్కుగా ఉంటే చాలు. నేను మీకు ఏరకంగానూ భారంకాను. ఏమంటారు?'' వెక్కుతూ అడుగుతున్న ఆమె మాటలకు ఏం సమాధానం చెప్పాలో తోచక గుటకలు మింగాడు.

''ఏమండీ, మాట్లాడరు?''

''నువ్వంటే నాకు ప్రాణం రూపా,... చేసుకుంటాను. తప్పక చేసుకుంటాను. రేపే రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్దాం. కానీ ఒక్క విషయం. నా భార్య శ్యామలను నేను ఒప్పిస్తాను. ఏమంటావ్?''

''ఒప్పుకుంటుందా?'' ఆశగా అడిగింది.

''తప్పకుండా. అయినా ఆమెకు ఎలాంటిఅన్యాయం చేయటం లేదు. నీకు న్యాయం చేస్తున్నాను. డియర్ రూపా. బాబుకు తండ్రి నవుతాను. నీకు ... నీకు భర్త నవుతాను'' అంటున్న అతన్ని చూసి రెండు చేతులు జోడించింది. సన్నగా పెదవులు వణికాయి. కళ్ళనిండా నీళ్ళు నిలిచాయి.

కన్నీళ్ళు తుడుస్తున్న ఆ చేతుల్ని తన చేతుల మధ్యకు తీసుకుంది. చెమర్చిన కళ్ళతో నవ్వాడు వీరేంద్రబాబు.

• • • •

''మా అమ్మగారు ఇది మీ కిమ్మన్నారు'' అంటున్న పిల్లవాణ్ణి చూసి అతని చేతిలో కాగితం తీసుకుంది. ఆ పిల్లవాడు పరిగెత్తాడు బయటకు. కాగితం మడతలు విప్పింది.

''రూపాదేవీ ...

నమస్కారం. నేను శ్యామలని. ఈ మధ్య మీ ఇద్దరీ గురించిన పుకార్లు వింటూనే ఉన్నాను. అవి పుకార్లనే నమ్మాను కాని నిన్న మీ ఇంటికి వచ్చి నప్పుడు చాటుగా మీ ఇద్దరి మాటల్ని తీసుకున్న నిర్ణయం విన్నాను. స్త్రీ దేన్నయినా పంచుకుంటుంది. కానీ భర్తను పంచుకోలేదు. నేను అంద గత్తెను కాను. గొప్ప కట్నంతో అతనికి భార్యనై ఇద్దరి పిల్లల తల్లినైనాను. అతని మనసులో నేను లేనని గూడా నాకు తెలుసు. సాధ్యమైనంతవరకు అతనికి అన్ని విధాలుగా తృప్తి కలిగేట్లే మసలు తున్నాను. మీరు కోరిన కోరిక మీ దృష్టిలో అన్యాయం కాకపోవచ్చు. నా దృష్టిలో నా కెంతో అన్యాయం చేస్తున్నట్లే భావిస్తున్నాను. అతను మిమ్మల్ని చేసుకుంటాడు. ఎలాగూ మీరంటే ఇష్టం గనుక మీ దగ్గరే ఉంటాడు. తర్వాత అది హక్కుగా అనిపిస్తుంది. అధికారంతో ఆజ్ఞాపిస్తారు. ఇప్పుడు మీలో ఉన్న భావం అప్పుడు ఇలా ఉండదు. నా పిల్లల్ని బతికించుకోడానికి నాకు ఉద్యోగంకూడా లేదు. అసలు ఎక్కువ చదువుకోలేదు కూడా. నేను చదువుకుంది మనుష్యుల్ని అర్థం చేసుకునేంత వరకే. ఆయన అడుగుతారు. ఏడ్చను. ఒప్పిస్తారు. ఒప్పుకుంటాను. ఏడ్చినా ఒప్పుకోకపోయినా మీ పెళ్ళి జరుగుతున్నప్పుడు నా విలువ పోగొట్టుకోవటం నా కిష్టం లేదు. ఏమండీ మిమ్మల్ని చేతులు జోడించి ప్రార్థిస్తున్నాను. మంచి మనసుతో ఆలోచించండి. నా స్థానంలో మీరు ఉంటే ఇలా చేయగలరా?

మమ్మల్ని విడదీయకండి. నాకూ నా పిల్లలకూ అన్యాయం చేయకండి. ఈ విషయం ఆయనతో చెప్పినా బాధలేదు. భార్యగా నా బాధ ఇది—''

• • • •

పది రోజులు గడిచాయి. ఈ పదిరోజులనుండి రూప ఇంటికి తాళం. రోజూ రావటం చూడటం వెళ్ళిపోవటం. ఇదీ వీరేంద్రబాబు దినచర్య. ఆ రోజు లెటరు వచ్చింది రూపనుండి. అందులో ఒక్కటే మాట... అంతా చదివితే గుడ్‌బై అన్నట్లుగా...

'శ్యామలగారి స్థానంలో నేనుంటే నా భర్తను మరో స్త్రీ కోరితే ఇవ్వగలనా అని అనుకున్నాను. అర్థమయిం దనుకుంటాను. నేను నా ఆనందమే చూసుకున్నాను గాని, మరో స్త్రీకి అన్యాయం చేస్తున్నానని ఆలోచించలేకపోయాను. నా నిర్ణయాన్ని మీ మంచిమనసుతో ఆలోచించండి. తప్పు అనిపించదు. నాది ఒంటరి అంటే బతుకు కాదు లెండి. నాకు బాబు ఉన్నాడు. ఈ జన్మ కిదిచాలు. ప్రామిస్. నేనేమీ బాధపడటం లేదు. ఒక రకంగా సంతోష పడుతున్నాను కూడా — మీ భార్య ఎంతో తెలివి కలది. ఆమెను మీరు సరిగా అర్థం చేసుకో వటం లేదు. ఆమెకు ఏ చిన్న కష్టం కలుగనీయకుండా ప్రేమగా చూసుకోండి ... ఇదే నా కోరిక.'

వీరేంద్ర బాబు మనసు మూర్ఛబోయింది. *


# రోజంతా తుమ్ముతూ గడపకండి



జలుబు వల్ల ఒక మంచి రోజును పాడవనివ్వకండి. ముక్కు కారడం, ఛాతీలో కఫం మరియు తలభారం. ఇవన్నీ జలుబు లక్షణాలు. మీరు బాధపడుతారు. ఒక మంచి రోజు పాడవుతుంది. మరి అలాంటప్పుడు తెలివైన పని ఎందుకు చేయకూడదు? కోల్డరిన్ వాడి చూడండి. ఇది ప్రత్యేకంగా తయారు చేయబడిన జలుబు బిళ్ల. ఎంతో అనుకూలమైనది. ఎంతో ఉపశమనం ఇస్తుంది.




జలుబుతో బాధ పడటం ఎందుకూ?
కోల్డరిన్ తీసుకోకూడదూ?

CASBC-111-124 TEL